


# మనిషి: మనసు

రచన: శ్రీ కె. కె. ఆర్. వి. ప్రసాదరావు

కాలేజీ ఆవరణముందు కారు ఆపేసరికి 'ప్రకాశరావును డిబార్ చేశారన్న వార్త శ్రీనివాసు చల్లగా నా చెవిలో వూదాడు.

'గుడ్! అయితే మన ప్లాను సక్సెస్ అయిందన్న మాట' కారు దిగి, 'టై' సర్దుకుంటూ అన్నాను.

'బ్రహ్మాండంగా! అదిగో, ఆయనగారు సన్మాన పత్రంతో సహా యిటే వేంచేస్తున్నారు' మావైపుగా వస్తున్న ప్రకాశరావును చూపుతూ అన్నాడు శ్రీనివాసు. ప్రకాశరావు తలవంచుకుని కళా కాంతులు కరువైన ముఖంతో మెల్లగా అడుగులో అడుగు వేసుకుంటూ మా సమీపానికి వచ్చాడు,

'వెరీసారీ ప్రకాశరావు! నీకు చాలా అన్యాయం జరిగింది' మనసులో ఆనందపుటలలు గంతులు వేస్తున్నా పైకిమాత్రం విచారవదనంతో అన్నాను.

'బహుశా నాకు అన్యాయం జరగడం మీకు, మీ సహచరులకు ఆనందంగానే వుంటుంది.' అక్కడక్కడ గుంపులుగా నుంచున్న విద్యార్థి బృందం వంక క్రీగంటగా చూసూ అన్నాడు.

'అంటే'

'నన్ను నలుగురిలో నగుబాటు పాలు చేద్దామని మీరంతా కలిసి ఆడిన నాటకమేగా'

'నన్ను అపార్థం చేసుకున్నావు. ఈ విషయంలో నా జోక్యం ఏమాత్రంలేదు.' నే నీమాటలు అంటున్నా అతడు నిజం గ్రహించ గలిగినందుకు ఒక విధంగా అభినందనీయుడే, అతడు నావంక అదోలా చూసి అక్కడ నుండి కదిలాడు. నేనే అతడి దగ్గరగా వెళ్లి, 'చూడు ప్రకాశరావు! ఇక యీ కాలేజీకి నీవు ఋణంతీరినట్టేగా. ఆఖరుసారిగా నా కారులో నీ రూముకు చేరుస్తాను. ప్లీజ్' అంటూ అతడి చేయిపట్టుకున్నాను. అతడు కొద్ది క్షణాలాలోచించి, వచ్చి కూర్చున్నాక కారు స్టార్టు చేసాను.

సిమెంటు రోడ్డుమీద కారు సాఫీగా నడుస్తోంది. తలను చేత్తో పట్టుకుని కనులు మూసుకొని ఏదో ఆలోచిస్తూ కూర్చున్న అతని వంక ఓసారి చూసాను. ఎన్నిసార్లు నా కార్లో కూర్చోమని ఆహ్వానించినా తిరస్కరించిన వ్యక్తి యిపుడిలా వెంటనే వచ్చి కూర్చోవడం నా కాశ్చర్యం కలిగించక పోలేదు.

కాలేజీలో నిన్న జరిగిన ఎలక్షనులో నాకు ప్రత్యర్థి ప్రకాశరావు. కాదు, ప్రకాశరావుకు ప్రత్యర్థిని నేను యిదీ నిజంకాదు. అతనికి ప్రత్యర్థిగా నన్ను నిలబెట్టారు. కొందరు భోక్తలు.

నాకు పెద్ద బంగళావుందని, తాతలు గడించిన ఆస్తి వుందని, కార్లున్నాయని, క్రిందటి సంవత్సరం నోట్లు చల్లబెట్టి, ఓట్లు కూడబెట్టి, ఛైర్మన్ గిరి మా నాన్న చేపట్టగా యీ సంవత్సరం కాలేజీ ప్రశిడెంటు పదవి నా చేతిలో వుంచాలని నన్ను నిలబెట్టారు. చివరకు విజయం ప్రకాశరావు దైంది.

కాలేజీలో మంచి విద్యార్థులుగా పరిగణింపబడుతున్న బహు కొద్దిమందిలో ప్రకాశరావు ఒకడు. సూక్ష్మగ్రాహి. చురుకైనవాడు.

ఓడిపోయానన్న సంగతి తెలిసిన తర్వాత నారూం నుండి బయటకు రాబుద్ధికాలేదు. సంజె వేళప్పుడు తేనెపట్టుమీద వాలిన ఈగల్లా నా చుట్టూ చేరింది స్నేహ బృందం.

చెడిపోతున్న వ్యక్తికి చేయూతనిచ్చి సహకరిద్దామన్న సద్బుద్ధి ఏ ఒక్కరిలోనో వుంటుంది బాగుపడుతున్న వాడ్ని చెడదీసే బుద్ధి అందరికీ పుడుతుంది.

క్రమంగా కాలేజీలో ప్రకాశరావుకు పెరుగుతున్న పలుకుబడిని చూసి మా బృందానికి కన్ను కుట్టింది. అతనికెలాగైనా అపకీర్తి ఆపాదిద్దామనే ఉద్దేశంతో తవొక ప్లాను వేశారు. చివరకు శ్రీనివాసు ప్లాను ఫలించింది.

తత్ఫలితంగా బోటనీ విద్యార్థిని సరళను ఒప్పించి, ప్రకాశరావు ఆమెకు వ్రాసినట్టుగా ప్రేమలేఖ సృష్టించి, అమెద్వారా ప్రిన్సిపాల్‌కు అందజేయడం, ఆయనగారు ప్రకాశరావును పిలిపించి ప్రేమలేఖ విషయమై ప్రస్తావించగా అతడు మౌనముద్ర చేపట్టడం, ప్రిన్సిపాల్ అతడ్ని డిబార్ చేయడం; యివన్నీ సినిమా రీళ్ళలా జరిగిపోయాయి.

♦ ♦ ♦ ♦

'ఏమిటి ఆలోచిస్తున్నావు? యిక మీదట ఏమి చేద్దామనా?' కళ్లు మూసుకొని పరధ్యాన్నంగా కూర్చున్న ప్రకాశరావును, స్టీరింగ్ వీల్ అటు యిటూ తిప్పుతూ ప్రశ్నించాను.

'చేయవలసినదేదో వెంటనే ఆలోచించాను.' నావైపు చూడకుండగనే నిర్లక్ష్యంగా వచ్చింది జవాబు. 'చింత చచ్చినా పులుపు చావలేదన్నమాట ఈయనగార్కి' మనసులోనే అనుకున్నాను.

యిపుడు ఎక్కడకు వెళ్దామన్నాను. అంతకన్న మరో ప్రశ్న నా మెదడులో మెదలలేదు. అతడొక స్థలం పేరు చెప్పేసరికి నాకాశ్చర్యం కలిగింది, అక్కడకు తీసుకువెళ్ళి నన్ను నిర్మూలిద్దామనుకుంటున్నాడేమోనని నాలో కొద్దిగా భయం కలిగినా, నాకున్న దేహ ధారుఢ్యంవల్ల స్థలాన్ని, ధైర్యాన్ని వుంజుకున్నాను. తనకు జరిగిన పరాభవాన్ని గూర్చి, నాతో స్నేహంవలన కలిగే పరిణామాలను గూర్చి, తనలో తాను దీర్ఘాలోచనలు చేస్తున్నట్టు, ఒకసారి అతని వంక చూసిన మరుక్షణమే నా సైకాలజీ నిర్ణయించింది. కొంతదూరం వెళ్ళాక కారు దిగి యిద్దరం కొండమీదికి దారి తీశాము.

మానవునిలో స్వార్థంకోసం, నిర్విరామంగా సాగే సమరంవలన కలిగే విషాగ్నికి తట్టుకోలేక కాబోలు, నిరంతరం విశ్వానికి వెలుగునిచ్చే సూర్యుడు కూడా ఒక నిమిషం ముందుగానే పశ్చిమదిశ కొండల మాటున తన ముఖాన్ని దాచుకోడానికి ప్రయత్నిస్తున్నాడు.

కొండమీదనుండి ఒకసారి దిగువకు చూసాను. దూరంగా భవనాలు, ఫ్యాక్టరీలు, ప్రౌనుకు ఓ పక్కగా గలగల పారే సెలయేరు, చూడటానికి ప్రకృతి ఆహ్లాదంగా, ఆనందంగా కన్పిస్తోంది. కాని; నాలుగడుగులు ముందుకు వేస్తే అగాధమైన లోయ. లోయలోనికి చూస్తే యదేచ్ఛగా పెరిగిన వృక్షాలు. చిందర వందరగా ముళ్ళపొదలు కన్పిస్తున్నాయి. అక్కడనుండి ఒకే వేళ ఖర్మకాలి, కాలుజారి క్రిందపడితే ప్రాణమే కాదు, నామరూపాలుండవు. ఈ ప్రకాశరావు మాటల సందడిలో నన్ను లోయలోనికి నెట్టితే? అంతే. ఆ భావన నా మనసునందు కలిగేసరికి శరీరం కంపించింది. ఆ అగాధానికి దూరంగా వచ్చి ముఖం నిండా పట్టిన చెమటను రుమాలుతో తుడుచుకున్నాను.





మా హృదయపూర్వకమైన దీపావళి అభినందనలు!!

శాంతి డైమండ్స్

*

రసాయనిక వజ్రములు
తయారించుటలో
ప్రసిద్ధి చెందియున్నాము.



వివరములకు

బి. కె. ఎన్. కన్నన్ & బ్రదర్స్.,
నెం: 37. పెద్ద సౌరాష్ట్ర వీధి :: తిరుచిరాపల్లి-8.



SELEKT
సెలెక్ట
CENTRIFUGAL
PUMPS
*



* ఎక్కువకాల మన్నిక.
* నిశ్శబ్దంగా పరుగు.
* శ్రేష్ఠమైన తయారి.
* ఖర్చులో తక్కువ.
* గ్యారంటి గలది.

Manufacturers :- Phone : 24548

CHITRA INDUSTRIES
8/60-A, TRICHY ROAD,
SINGANALLUR : : COIMBATORE-5.

మా యిద్దరి మధ్యా కొద్ది క్షణాలు మౌనం.

'చూడు ప్రతాప్! అక్కడ నీకేం కన్పిస్తుంది?' మేమున్న స్థలానికి దూరంగా కనిపించే దృశ్యాన్ని చూపుతూ ప్రకాశరావు నన్నడిగాడు.

'పెద్ద పెద్ద భవనాలు, ఫ్యాక్టరీలు'

'అవి తప్ప మరేమీ కన్పించలేదా? అని తిరిగి ప్రశ్నించాడు.

'కన్పించేవి చాలా వున్నా చెప్పుకోదగ్గవి మాత్రం అవే'

నా సమాధానం విన్నతర్వాత ప్రకాశరావు నిశితంగా నా వంక ఒకసారి చూసి యిలా అన్నాడు.

'ప్రతాప్! ఆకాశాన్నంటేలా పసిడి ఛాయల గోడలతో, పాలరాతి గచ్చులతో, వింత వింత రంగులలో వెలుగునిచ్చే విద్యుద్దీపాలతో, తళ తళ మెరుస్తూ, యింద్ర భవనాన్ని సహితం మైమరపింపజేసే ఆ ధనవంతుల భవనం మాత్రమే నీకు కన్పిస్తున్నాయి. అంత పెద్ద భవనాలు యిద్దరు లేక ముగ్గురుకు మాత్రం నివాస యోగ్యంగా వున్నాయి.

కాని యిటువైపు చూడు! చిన్న ఈదురగాలి తాకిడికి సహితం పైకి లేచిపోయే లాగున, సూర్య చంద్రులు తమ ప్రతాపాలను ప్రదర్శించుకోనేందుకు వీలుగా, పేరుకుమాత్రం అలా భూమిమీద నున్న పూరిగుడిసెలు; ఆరిపోయిన గొంతుకకు తడిచేసుకోవడానికి ఒక గంజి బొట్టులేక, కడుపు డొక్కలా తయారయి వెన్నుకు అంటుకుపోయిన, యెన్నెన్నో నిరుపేదల నికృష్ణపు జీవితాలకు నివాసాలు. వెలుగు నివ్వడానికి చమురులేక, ఆరిపోవడానికి శక్తి చాలక మిణుకు మిణుకుమని ప్రకాశించే ప్రమిదలోని వత్తులా, తూర్పు తెల్లవారింది మొదలు చీకటి పడేవరకూ రోబంతా భారంగా గడుపుతూ, ఎండలో. వానలో, చలిలో కూడ జీవనాలను వెళ్ళబుచ్చుకోవడానికి ఆ పూరిండ్లే వారికి పాలరాతి భవనాలు, చలువరాతి మేడలు,

తెల్లవారి లేచేసరికి కావలసిన వస్తువు కాళ్ళదగ్గర వుంటుంది కలవారికి. సంతృప్తికరమైన ఆహారం, విహారాలతో, వినోదాలతో, విలాసంగా, వుల్లాసంగా వెన్నెలలా వెలుగుతుంది వారి దైనందిన జీవితం.

ఏ సమయంలో ఏ విధమైన వ్యాధిని వ్యాపింప జేస్తాయో తెలుసుకోలేని క్రిమికీటకాదులతో నిండిన మురికినీటి కాలువలు యింటిచుట్టూరా వుంటే, సముద్ర మధ్యస్థంలో, సుడిగుండంలో తిరిగే నావలా, ఆకలి తప్పులతో ప్రేగులు చుట్టుకుపోయి, జీవించాలన్న ఆసక్తితో, రేపటిమీద ఆశతో, బ్రతుకుమీద మమకారంతో, తెచ్చి పెట్టుకున్న నోపికతో. చీకటి బ్రతుకులో వెలుగు కనిపించకపోగా దిక్కుతోచక బ్రతుకు బండబారి మొండిగా కాలాన్ని దొర్లిస్తున్నారు దరిద్రులు.

ప్రకాశరావుకు క్రమంగా ఆవేశం అధిక మౌతోంది. ముఖం గంభీరంగా మారింది. 'అలుగుటయే యెరుంగని మహామహితాత్ముడు...... నిండు సభాస్థలిలో నీల మేఘశ్యాముడు దుష్టదుర్యోధనుని దుర్బుద్ధిని దూరం చేయడానికి చేస్తున్న విశ్వప్రయత్నంలా వుంది అక్కడి సన్నివేశం.

నేను ఆచేతనుడిలా అలా నుంచుని అతడు చెప్పేది వింటున్నాను. అతనిలో అంతటి గాంభీర్యం వుందని, అంతలా విమర్శించేశక్తి సాహసంవుందని నే ననుకోలేదు.

'ప్రతాప్! అక్కడ నిత్యం ఏం బరుగుతుంటుందో నీకు తెలుసా?' దూరంగా కనిపించే 'గ్లాస్ బంగళా' ను చూపుతూ అడిగాడు.

అ భవనంలో రోజూ ఏం జరుగుతూ వుంటుందో నీకు తెలుసు. నాకున్న ఆస్థి, అంతస్థు, హోదా, దర్జా; యివన్నీ ఆందరికీ చూపడానికి నేనూ యీ మధ్య తరుచుగా అక్కడకు వెళ్ళడం, అక్కడ జరిగే పార్టీల లోను, తదితర కార్యక్రమాల్లోను పాల్గొనడం నేర్చుకుంటున్నాను అతనడిగిన ప్రశ్నకు సమాధానంకోసం నావంక చూసేసరికి నేను మౌనంగా తలవంచుకున్నాను.

'అక్కడ ఏం జరుగుతూవుంటుందో నీకు తెలుసు. నీటుగా తయారయి, మేనును మరిపించే మత్తుపానీయాన్ని చిత్తుగా త్రాగి, విదేశీయి నృత్యాలతో, కనులు మూసుకుపోతున్నా కనురెప్పలు బలవంతంగా విప్పుతూ, స్త్రీ పురుష వివక్షతలేకుండా త్రాగిన మైకంలో తడబడే



అడుగులతో ఒకరినొకరు తోసుకుంటూ, తొక్కుకుంటూ రోజులు, వారాలు మాత్రమేగాక నెలలు కూడా గుర్తుండకుండా వుంటారక్కడ.

నిండు చంద్రుని పండువెన్నెలకోసం నిరీక్షించే చకోరిలా కలవారు తినలేక వీధిలోకి విసిరేసే ఎంగిలి ముద్దకోసం కన్నులు కాయలు కాచేలా నిరీక్షిస్తూ రోజులు, వారాలు వెళ్ళబుచ్చుతున్న మావంటి యెన్నో బీదబ్రతుకులున్నాయి.

ప్రతాప్! నేను కేవలం ధనవంతులను విమర్శిస్తున్నానని మాత్రం తలంచవద్దు. కాని పిచ్చుకమీద నాబ్రహ్మాస్త్రప్రయోగం! నా చదువుకు మాహారంతా చేయూతనిచ్చి, సమయానికి సహకరిస్తూ నన్నింతవాణ్ణిగా తయారుచేసారు. నేను విద్యలో విజయం సాధించి, వారి జీవితాలకు ఆధారం, ఆస్కారం కల్గిస్తానని కొండంత ఆశతో ఎదురుచూస్తున్నారు. ఎలుకకు ప్రాణసంకటమైతే, పిల్లికి చెలగాటమట. మీ ఉచ్చులో ఎప్పటికైనా చిక్కబడక తప్పదని ఆలోచించే నేను ప్రిన్సిపాల్ వద్ద తలవంచాను. కాని నా ఒక్కని జీవితంతో ఎందరి జీవితాలు ముడివడి ఉన్నాయో ఒక్కసారి ఆలోచించు, నాగురించి మావారు కన్న కలలన్నీ పగటికలలైనాయి.

ప్రకాశరావు కను కొనల్లో నీరు నిండింది. బాధకరమైన బ్రతుకుల్ని బాగుచేద్దామని బాధ్యతగా విద్య నభ్యసిస్తున్నాడతడు. కాలక్షేపంకోసం, షోకులు, సరదాలు తీర్చుకుంటూ నేను చదువుతున్నాను. మా యిరువురి మనస్తత్వాలమధ్య అనంతమైన అంతర్యం వుంది. ఎందరో నాలాంటి ప్రతాప్‌లు కలిస్తే ఒక్కప్రకాశరావుకు సమాన మౌతారు! అతనిపై వేసిన అపవాదుపట్ల అతని ముఖం చూడడానికి నాకే సిగ్గనిపించింది.

మేమంతా కలిసి ఆడిన నాటకంలో నీ తప్పిదం ఏమాత్రం లేదని, ప్రిన్సిపాల్‌తో నిజంచెప్పి, నీ నిర్దోషిత్వాన్ని నిరూపిస్తానని మమ్మల్ని క్షమించమని ప్రకాశరావును వేడుకున్నాను.

ఇక లాభంలేదు. ఈ సరికే యీ వార్త వూరంతా ప్రాకివుంటుంది. మా వారికి నాయందుగల సదభిప్రాయం చెడిపోతుంది. నాకిక వారి సహాయసంపత్తి లభించదు.

ఈ అపనిందతో నాకిక జీవించాలన్న కోరిక నశించింది. ప్రతాప్! ఇకమీదనైనా మాలాంటి జీవితాలతో చెలగాట మాడవద్దని అర్థిస్తున్నాను' అంటూ ఒక్కొక్క అడుగు వెనక్కి వేస్తూ ఆ అగాధంలోనికి జారుకున్నాడు.

నేను మొదట్లో వూహించిన దానికి వ్యతిరేకంగా, హఠాత్తుగా జరిగిన యీ సంఘటనకు నాశరీరం కంపించి మైకం నమ్మినట్లయింది. ఆ మైకంలో గట్టిగా ప్రకాశరావును పిలుస్తూ ఆత్రంగా అడుగులు ముందుకు వేస్తున్నానట. కాని కొద్దిక్షణాలక్రితమే అక్కడకువచ్చి మా యిరువురి సంభాషణ పొంచి వింటున్న నా స్నేహబృందం. నన్ను బలంగా వెనక్కిలాగి పట్టుకున్నారు.

◆ ◆ ◆ ◆

ఓ విషయం మీ ముందు వెడుతున్నాను. ఒక్కప్రకాశరావు చనిపోయాడు. కాని అలాంటి ప్రకాశరావులు ఎంతోమంది వున్నారు. నాలాంటి ప్రతాప్‌ల సరదాలకు, అలాంటి ప్రకాశరావులు, అతడ్ని అంటిపెట్టుకున్న బీదల బ్రతుకులు, వారి ఆశలు, ఆశయాలు మాత్రం బలి కాకూడదు.

మా హృదయపూర్వకమైన దీపావళి అభినందనలు
అందానికీ -
మన్నికకూ -


జయప్రకాష్ బనియన్లనే
వాడి సంతృప్తి పొందండి.
*
జయప్రకాష్ హొయిసరీస్,
తిరుపూరు - 2 (S.I.)